


బేరసారాల బదిలీలు..!

- జీవో 317 బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా
- పరస్పర బదిలీలపై ఉపాధ్యాయుల ఆసక్తి
- నచ్చిన చోటకు పోస్టు కోసం లక్షల్లో బేరాలు
- టీచర్ల వాట్సాప్ గ్రూపుల్లో వివరాలతో పోస్టులు
- ఏజెంట్ల అవతారం ఎత్తిన కొందరు ఉపాధ్యాయులు



మంచిర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేను.. ఫలానా జిల్లాలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. నేను ఈ జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. అక్కడ పనిచేసే వారు ఎవరైనా ఉంటే నన్ను సంప్రదించండి.. అంటూ కొందరు ఉపాధ్యాయులు వాట్సాప్‌లో పోస్టులు పెడుతున్నారు. జీవో 317తో నష్టపోయిన ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనుమతినివ్వడంతో ఆశావహుల్లో ఆనందం నెలకొంది. తమకు నచ్చిన ప్రదేశం నుంచి ఎవరైనా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు అంగీకారం తెలిపితే తగిన నజరానా అందిస్తామని కొందరు ఉపాధ్యాయులు రాయబేరాలు సాగిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. పనిలో పనిగా.. కొందరు ఉపాధ్యాయులే దళారుల అవతారం ఎత్తి, ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చి కమీషన్ జేబులో వేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

జీవో నెంబరు 317 నష్టపోయిన ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో పరస్పర బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల మధ్య బేరాలు కుదురుతున్నాయి. జీవో 317లో స్థానికతను కాకుండా సీనియారిటీ పరిగణనలోకి తీసుకొని జిల్లాలు కేటాయించడంతో అప్పుడు సీనియర్లు కోరుకున్న సొంత జిల్లాల్లో కొనసాగుతుండగా, జూనియర్ ఉపాధ్యాయులు ఇతర జిల్లాలు, మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవోలు 243 (స్పౌజ్), 244 (మెడికల్), 245 (పరస్పర) బదిలీలకు ఈనెల 30 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు బేరాలు కుదుర్చుకుంటున్నట్లు వివిధ ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న మెసేజ్‌లను బట్టి తెలుస్తోంది.

డీఈవో కార్యాలయాలే అడ్డాలు....?

పరస్పర బదిలీలకు బేరాలు కుదుర్చుకునేందుకు డీఈవో కార్యాలయాలే అడ్డాలుగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న పోస్టులను చూస్తున్న ఆశావహులు డీఈవో కార్యాలయాల వద్దకు వస్తే ఓ మాట మాట్లాడు..

చేతులు మారనున్న కోట్లాది రూపాయలు

2022లో జరిగిన పరస్పర బదిలీల తరహాలోనే ఇప్పుడు కూడా పెద్ద మొత్తంలో చేతులు మారనున్నట్లు విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. అప్పుడు నిర్వహించిన పరస్పర బదిలీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందలకోట్ల రూపాయలు చేతులు మారగా, ప్రస్తుతం అంతకంటే ఎక్కువ మొత్తంలో ముట్టజెప్పేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఆనాడు గరిష్ఠంగా మంచిర్యాల జిల్లాలో బదిలీకి రూ.10 లక్షలు పలుకగా, ఇప్పుడది రూ.15లక్షల వరకు చేరుకునే అవకాశాలు న్నట్లు ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 2017 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు వారి సొంత జిల్లాలకు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతుండటం, స్పౌజ్ కేటగిరీల్లో అవకాశం దొరకని పరిస్థితి ఉన్నవారు పరస్పర బదిలీలకు ప్రయత్నాలు ప్రారంభించడంతో ఈసారి అధిక డిమాండ్‌కు తెరలేచినట్లు ప్రచారం జరుగుతోంది.

మిగతా 7లో

భక్తిమాసం.. ధనుర్మాసం...

- నేటి నుంచి ప్రారంభం



నస్పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భక్తి శ్రద్ధలతో నిర్వహించే ధనుర్మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. భక్తులు ధనుర్మాసంను ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. సోమవారం నుంచి మొదలై వచ్చే నెల 13న గోదాదేవి-రంగనాయకస్వామి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుంది. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మాసం కావడం వలన వైష్ణవులు ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ మాసంలోనే ముక్కోటి ఏకాదశి జనవరి 10న వస్తుంది. ధనుర్మాసం వచ్చిందంటే ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. నెలరోజుల పాటు వైష్ణవ ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతాయి. రోజు ఉదయం సాయంత్రం, భజన, తీర్థ ప్రసాదగోష్ఠి, సామూహిక విష్ణుసహస్ర పారాయణం జరుగుతాయి. జిల్లాలోని వేంకటేశ్వర, వైష్ణవాలయాల్లో సోమవారం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మూడు గదులు.. ఎనిమిది తరగతులు

- ఇరుకుగా ఉండడంతో పాఠాలు అర్థం కావడం లేదని ఆవేదన
- రూ. 20 లక్షలతో కొత్త భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు
- పనులు నిలిచిపోయినా పట్టించుకోని అధికారులు



కుకుడ పాఠశాల

6

ఆదర్శ మాస్టారు..

- అవయవాలు ముద్రించిన టీషర్ట్స్‌తో బోధన
- స్కూల్ యూనిఫాంలోనే విధులకు హాజరవుతున్న టీచర్
- విద్యార్థులకు విలువలు నేర్పేందుకు ప్రత్యేక కృషి
- సమాజ సేవలోనూ మన్ననలు అందుకుంటున్న భీమ్‌పుత్ర శ్రీనివాస్



బొమ్మల టీషర్టు ధరించిన శ్రీనివాస్

7

ఆరో రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ఎదుట కళ్ళకు గంతలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరవ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు క ళ్ళకు నల్ల రిబ్బన్ కట్టుకుని ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. శిబిరంలో మోకాళ్లపై నిలబడి క్రమబద్ధీకరణ చేయాలంటూ నినాదాలు చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పిల్లలతో కలిసి శిబిరంలో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి, తమ న్యాయమైన డిమాండ్లను సాధనకు ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎస్ఏ-జెఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి రాజన్న లు వెల్లడించారు.

పర్యావరణానికి సీఎండీ చేయూత

- ఎస్‌టీపీపీలో 209 మొక్కలు నాటిన సీఎండీ బలరాం



ఎస్‌టీపీపీలో మొక్కలు నాటుతున్న సీఎండీ బలరాం

జైపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ ప్రేమికుడు, తెలంగాణ ట్రీ మ్యాన్, సింగరేణి సీఎండీ ఎన్. బలరాం మొక్కలు నాటే యజ్ఞంలో మరో ముందడుగు వేశారు. ఆదివారం జైపూర్ మండలంలోని ఎస్‌టీపీపీలో 209 మొక్కలు నాటారు. దీంతో ఇప్పటి వరకు సింగరేణి వ్యాప్తంగా 18500 మొక్కలు నాటిన ఘనత ఆయనకు దక్కింది. అనంతరం మాట్లాడుతూ, మానవాళిని భవిష్యత్‌లో రక్షించాలంటే ఇప్పటి నుంచే మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఆరు జిల్లాల్లో 40 చోట్ల మొక్కలు నాటానన్నారు. వాటిలో 35కు పైగా మినీ ఫారెస్టులుగా పెరుగుతున్నాయన్నారు. తాను నాటిన మొక్కల్లో 90 శాతం వృక్షాలుగా మారడం సంతోషంగా ఉందన్నారు. 2019 జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 108 మొక్కలను కొత్తగూడెం బంగ్లాస్ ఏరియాలో నాటినట్లు చెప్పారు. అప్పటి నుంచి మొక్కలు నాటుతూ ఎస్‌టీపీపీలో 18,500 మైలురాయి దాటిందన్నారు. మొక్కలు ఎలా పెరుగుతున్నాయనే తెలుసుకోవడానికి జియో టాగింగ్ ద్వారా కార్యాలయం నుంచి పరిశీలించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీఎన్‌జీవోల జిల్లా అడ్‌హక్ కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరి

గర్మిళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయ, సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్‌కు జిల్లా అడ్‌హక్ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి, కార్యదర్శిగా హబీబ్ హుస్సేన్, డైరెక్టర్లుగా మొండయ్య, రామ్మోహన్, గోపాల్, కళావతి, ప్రసాదరావు, సంతోష్, ఇంతియాజ్, ముఖ్య సలహాదారులుగా పుప్పాల హనుమంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, గోవిందరెడ్డి, తిరుపతి రెడ్డి, హనుమంత రెడ్డి, లలితలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికయ్యే వరకు అడ్‌హక్ కమిటీ కొనసాగుతుందని, గృహ నిర్మాణం ఎవరికీ అన్యాయం జరుగకుండా చూస్తామని వారు పేర్కొన్నారు.

ముందస్తు రైతు దినోత్సవం సంబరాలు

గర్మిళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జన్మభూమి నగర్‌లో గల ఎథిక్ అకాడమీ స్కూల్‌లో ముందస్తుగా జాతీయ రైతుల దినోత్సవం సంబరాలు నిర్వహించారు. చిన్నారులు రైతుల వేషధారణలో నాట్లు వేశారు. రైతుల గొప్పతనం నేర్పేందుకు వారంరోజుల పాటు రైతు సంబరాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ చరణ్ రెడ్డి అన్నారు.



నాట్లు వేస్తున్న చిన్నారులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- మొదటి రోజు 49.87 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ కుమార్ దీపక్



ఆర్‌బీహెచ్‌వీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆదివారం నాటి పరీక్షలకు 14968 మంది అభ్యర్థులకుగాను ఉదయం 7446 మంది, మధ్యాహ్నం 7363 మంది అభ్యర్థులు మాత్రమే హాజరుకాగా, 83 మంది గైర్హాజరయ్యారు.

సోమవారం జరిగే గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం ఆయన జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. నోడల్ అధికారులు, నిర్వాహకులకు సూచనలు అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహించిన రెండు పరీక్షలకు ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. కాగా పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, సీఐ ఆకుల అశోక్, ఎస్సై సుగుణాకర్‌లు పరిశీలించారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రూపు 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. 144 సెక్షన్ విధించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌లు బందోబస్తు చేపట్టారు.



నస్పూర్‌లో పరీక్ష కేంద్రం వద్ద డీసీపీ భాస్కర్, సీఐ అశోక్, ఎస్సై సుగుణాకర్

ఇళ్లను పంచే శక్తిలేని నాయకులు మీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, పాల్గొన్న చిట్ల సత్యనారాయణ, సల్ల మహేష్, తూముల నరేష్

మంచిర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన 400 డబుల్ బెడ్రూం ఇళ్లను పంచే శక్తిలేని నీవు అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును ఉద్దేశించి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో నిత్యం తాగునీరు ఇచ్చిన ఘనత తమదేనన్నారు. కొబ్బరికాయలు కొట్టే బ్యాచ్ తాను కాదని, అభివృద్ధి పనులు చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. 20 సంవత్సరాలలో జరగని అభివృద్ధిని 6 నెలల్లోనే చేసి చూపించానన్నారు. అభివృద్ధిపై తాను ఎక్కడికి రావడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు నష్టపోయారని, తాలు, తప్ప పేరుతో ధాన్యం కొనుగోళ్లలో 10 కిలోలు కోత పెట్టారని ఆరోపించారు. కోత పెట్టిన ధాన్యం డబ్బులను ఎవరు బుక్కారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి లీటరు నీటిని తీసుకోకుండా కోటి 53 లక్షల టన్నుల ధాన్యం పండించామన్నారు. మీ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుడు, కూలుడు కూడా అయిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని, పదేళ్ల పాలనలో మెస్ చార్జీలు కూడా పెంచలేదన్నారు. తమ ప్రభుత్వం మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచిందన్నారు. 2 లక్షల రూపాయల రుణమాఫీ 89 శాతం పూర్తయిందని, కొందరు రైతుల డాక్యుమెంట్లు, ఇతర సమస్యల వల్ల రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష రుణమాఫీ విడుతల వారీగా చెల్లించగా అవి వడ్డీలకే సరిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు ఇప్పటి వరకు తమ ప్రభుత్వం రూ.62 వేల కోట్లు వడ్డీ చెల్లించిందన్నారు. బీజేపీ నాయకులు కొత్త బిచ్చగాళ్ల లాగా తమ పబ్బం గడుపుకోవడానికి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద 155 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, వైస్ చైర్మన్ సల్ల మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి ప్రభాకర్, పట్టణాధ్యక్షుడు నరేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వసుంధర, రజిత, పాల్గొన్నారు.

కవ్వాల్‌లో ముగిసిన బర్డ్ వాచ్



కెమెరాకు చిక్కిన పక్షులు

జన్నారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కవ్వాల్ అభయారణ్యంలో పక్షులు సందడి చేశాయి. యేటా నిర్వహించే బర్డ్ వాచ్‌కు పర్యావరణ ప్రేమికులు తరలివచ్చారు. అభయారణ్యంలో ఏర్పాటు చేసిన బర్డ్ వాచ్‌కు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కవ్వాల్ ఆతిధ్యం ఇస్తోంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో శనివారం ప్రారంభమైన బర్డ్ వాచ్‌కు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చారు. 15 మంది రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. కవ్వాల్‌లో పక్షుల సందడిని తిలకించేందుకు ఇష్టపడ్డారు. బర్డ్ వాకర్స్ శనివారం రాత్రి అటవీ ప్రాంతంలో అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లలో బస చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి మైసమ్మకుంట అటవీ ప్రాంతంలో బర్డ్ వాకర్స్ పక్షులను లెన్స్ కెమెరాల ద్వారా తిలకించారు. సఫారీ ద్వారా వివిధ ప్రాంతాలకు వెళ్తూ అడవిలో ఉన్న వివిధ రకాల పక్షులను కెమెరాలో బంధిస్తూ వాటి గురించి ఒకరికొకరు చర్చించుకున్నారు. ఎఫ్ఆర్‌వో సుష్మారావు, శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.



కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్స్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను నిలబెట్టుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మైనార్టీ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలను సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీలోకి కండు వాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడు తూ ఇప్పటికైనా కార్మిక, కర్షక సంక్షేమంపై దృష్టి సారించి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఎస్‌సీ సబ్ ప్లాన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. ఏఐడీఆర్ఎం జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు కలిందర్ ఖాన్, మేకల పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కత్తెరశాల కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చెన్నూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కిష్టంపేట, కత్తెరసాల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 315 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. తేమ శాతం, సాలు, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రా లకు తీసుకరావాలన్నారు. కేంద్రాల్లో నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్, తదితరులున్నారు.

టీజీ పెటా కార్యవర్గం

మంచిర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాయా మ ఉపాధ్యాయ సంఘం (పెటా) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశం అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా బండి రవి, ప్రధాన కార్యదర్శిగా సుర సురేందర్, కోశాధికారిగా కే జ్యోతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సిరంగి గోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాజుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా సూరం రవి, ఎండి చాంద్‌పాషా, కె విఠల్, ఎ సాంబమూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా ఎన్ సంతోష్ కుమార్, ఏ కార్తీక్, కరీం ఉన్నీసా, గుమాస వరలక్ష్మి ఎన్నికయ్యారు. అలాగే మహిళా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల విభాగం ఇన్‌చార్జిలుగా కే సంపూర్ణ, ఏ వరలక్ష్మి, ఎన్ పద్మ, ఎ ఇందిర, కేజీబీవీ పీఈటీల ఇంచార్జిగా కే అనిత, మోడల్ స్కూల్ పీడీల ఇంచార్జిగా ఎన్ సుదీప్ కుమార్, గురుకుల పాఠశాలల ఇన్‌చార్జిగా వంగల సురేష్ కుమార్, కే విశాల ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సాయికుమార్ (ఫైల్)

దండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన బెంబడి సాయికుమార్ (21) అనే యువకుడు శనివారం రాత్రి ముత్యంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు సాయికుమార్ శనివారం సాయంత్రం స్నేహితుడు రాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై దుస్తులు కొనడానికి లక్షెట్టిపేట వెళ్లారు. తిరిగి రాత్రి స్వగ్రామమైన కొర్విచెల్మ వస్తుండగా ముత్యంపేటలో రోడ్డు పక్క బైక్ ఆపారు. ముత్యంపేట నుంచి కొర్విచెల్మ వైపు ధాన్యం బస్తాలతో వస్తున్న (ఏపీ 05 టీటీ 9259) గల లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొన్నాడు. బైక్‌పై కూర్చొన్న రాజు పక్కకు పడగా, వెనుక కూర్చొన్న సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబు లెన్స్‌లో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి సాయికుమార్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మందమర్రి టౌన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బొక్కలగుట్ట రోడ్డు వద్ద మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలమడుగు నుంచి ఇంద్రవెల్లి వైపు అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆటో ట్రాలీలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని, వీటి విలువ 36 వేలు ఉంటుందని, గుర్రాల రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బినామీ పేర్లతో టోకరా

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.6 కోట్లు స్వాహా

- ఐదేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిపై రుణం

- బాధితులంతా చెన్నూరు మండల వాసులే

చెన్నూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో బినామీ పేర్లపై రూ.6 కోట్ల స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మంచిర్యాలకు చెందిన ఓ ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలో చెన్నూరు మండలంలోని కత్తెరసాలకు చెందిన ప్రవీణ్‌రెడ్డి ఫీల్డ్ అధికారిగా పని చేస్తున్నాడు. ఈ ప్రాంతం వారి పేర్లపైనే నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.6 కోట్లు కాజేసినట్టు సమాచారం. కత్తెరసాల, కిష్టంపేట గ్రామాలకు చెందిన సుమారు 20 మంది పేర్లపై భవనాలున్నట్టుగా ఫేక్ ఫొటోలు, డాక్యుమెంట్లతో ఒక్కొక్కరిపై రూ.25 లక్షల నుంచి రూ.30లక్షలు తీసుకున్నట్టు తెలిసింది. కిష్టంపేట గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి అనే వ్యక్తి ఐదు సంవత్సరాల క్రితమే మృతి చెందగా, ఆయన పేరు మీద రూ.25లక్షల రుణం తీసుకున్నాడు. అయితే రవీందర్‌రెడ్డికి భవనం లేకపోగా, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి చెందిన భవనం ఫొటో, అడ్రసు ఇచ్చి మోసానికి పాల్పడ్డాడు.

ఇటీవల సదరు ఫైనాన్స్‌కు చెందిన ఉద్యోగి కిష్టంపేటకు వచ్చి ఈఎంఐ కట్టాలని ఇంటి యజమానిని కోరారు. దీంతో మోసం విషయం బయటకు వచ్చింది. తనపేరు రవీందర్‌రెడ్డి కాదని, తాను ఎలాంటి రుణం తీసుకోలేదని, రవీందర్‌రెడ్డి ఐదేళ్ల క్రితమే మృతి చెందినట్టు తెలిపారు. దీంతో వారు విచారణ జరుపగా ఫైనాన్స్‌లోనే పని చేస్తున్న కత్తెరసాలకు చెందిన వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్లతో రుణం తీసుకున్నట్టు తేలింది. దీంతో ఫైనాన్స్ అధికారులు విచారణ జరుపగా మరిన్ని రుణాలు బాగోతం బయటకు వచ్చింది. చెన్నూరు సీఐ రవీందర్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

యువతి ఆత్మహత్య

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గన్నారం గ్రామానికి చెందిన కమ్మరి అనూష(20)ను ప్రేమికుడు సందీప్ మోసం చేసినందుకు ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన అనూష, సందీప్ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. సందీప్ పెళ్లికి నిరాకరించటంతో మనస్తాపానికి గురై అనూష ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. అనూష తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగర్‌గూడ గ్రామం నుంచి హైదరాబాద్‌కు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం అగర్‌గూడ నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తొమ్మిది పశువులను తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు నిఘా ఉంచి వాహనాలను తనిఖీ చేయగా వాహనంలో ఎనిమిది ఆవులు, ఒక ఎద్దును పట్టుకున్నట్లు తెలిపారు. మద్దెల గంగాధర్, సయ్యద్ అబ్బు, షేక్ రమావత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం 6 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గ్రామాల్లో సేకరించిన బియ్యాన్ని రెండు ఆటోల ద్వారా బెల్లంపల్లి వైపునకు తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామన్నారు. రెండు ఆటోలతోపాటు మంచిర్యాలలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన చింతల కృష్ణ మనోహర్, వానరాశి రమేష్‌లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరు మండలంలో పలు గ్రామాల్లో బియ్యం సేకరించి మహారాష్ట్రకు తరలిస్తారని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపారు. రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి రెండు ఇళ్లు దగ్ధం

రూ. 3లక్షల నగదు, రెండు తులాల బంగారం ఆహుతి

కెరమెరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని దేవాపూర్ తుమ్మగూడకు చెందిన అత్రం బారిక్‌రావు, అత్రం లక్ష్మణ్‌కు చెందిన రెండు పెంకుటిళ్లు ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమయ్యాయి. అత్రం బారిక్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బారిక్‌రావు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో పక్కన ఉన్నవారు సమాచారం ఇవ్వడంతో మంటలను అర్పిందేకు ప్రయత్నించారు. అయినప్పటికి మంటలు వ్యాప్తి చెందడంతో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఆసిఫాబాద్ ఫైర్‌సిబ్బంది అక్కడికి వెళ్లి చుట్టూ పక్కల మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేశారు. బారిక్‌రావుకు సుమారు రూ.3లక్షల నగదు, రెండు తులాల బంగారంతో పాటు ఇంటి సామగ్రి కాలిపోయింది. లక్ష్మణ్‌కు చెందిన ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాపోయిందని తెలిపాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

లింగాపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చోర్‌పెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దేవుగూడ గ్రామంలోని నైతం మానిక్‌రావు ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని నిల్వ ఉంచిన పత్తి కాలిపోయింది. మంటలకు మూడు క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని, సుమారు రూ. 20 వేల ఆస్తి నష్టం జరిగినట్లు మానిక్‌రావు తెలిపాడు.

మూడు గదులు..

ఎనిమిది తరగతులు

- ఇరుకుగా ఉండడంతో పాఠాలు అర్థం కావడం లేదని ఆవేదన
- రూ. 20 లక్షలతో కొత్త భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు
- పనులు నిలిచిపోయినా పట్టించుకోని అధికారులు



ఒకే తరగతి గదిలో రెండు,మూడు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

బెజ్జూరు మండలంలోని కుకుడ పాఠశాలలో మూడు గదుల్లోనే ఎనిమిది తరగతులను కొనసాగిస్తున్నారు. సరిపడా స్థలం లేక పోవడంతో ఒకే గదిలో రెండు, మూడు తరగతులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. దీంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

బెజ్జూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అమలు కాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లోని విద్యార్థులకు స్థానికంగానే అన్ని వసతులతో కూడిన విద్యా బోధనతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా అందుబాటులోకి రావడం లేదు. మండలంలోని కుకుడ ప్రాథమికోన్నత పాఠశాలే. ఈ పాఠశాలలో 1నుంచి 8తరగతులు కొనసాగుతున్నాయి. 101మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. దీంతో ఒకే తరగతి గదిలో రెండు, మూడు తరగతులను నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు

● రూ. 20 లక్షల వ్యయంతో..

కుకుడ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం కోసం ఉమ్మడి రాష్ట్ర హయాంలో సుమారు 20లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం అదనపు గదలు ఏర్పాటు కోసం భవనం మంజూరు చేసింది. ఇప్పటికీ గదుల నిర్మాణం పూర్తి కాలేదు. అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే నిలిపేశారు. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణం మాత్రమే పూర్తయింది. దీంతో ఉర్దూ పాఠశాలలో తరగతులు కొనసాగిస్తున్నారు. అసౌకర్యాల మధ్య చదువులు కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా భవనం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం

● ఉపాధ్యాయులు లేక అవస్థలు..

కుకుడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు కూడా లేరు. ఇక్కడ కేవలం ఒక స్కూల్ అసిస్టెంట్, ముగ్గురు ఎస్జీటీలు మాత్రమే పని చేస్తున్నారు. ఇక్కడ అన్ని తరగతుల సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు ఉండాల్సి ఉన్నా పూర్తి స్థాయిలో లేని కారణంగా విద్యార్థులకు చదువు అందడం లేదు. ఇటీవల ఉపాధ్యాయుల భర్తీలో పోస్టులు చూపెట్టని కారణంగా భర్తీ కాలేదు. ఉన్న ఉపాధ్యాయులే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్, కార్యదర్శి గుర్రాల వెంకటేశ్వర్లు సభ్యులు అమలమేరి, రాజేశ్వర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించిన యువకులకు సన్మానం

బెజ్జూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన దుర్గం మధుకర్, గొల్లపల్లి సత్యనారాయణ ఇటీవల ప్రభుత్వ కొలువులు సాధించడంతో ఆదివారం గ్రామస్థులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఊరికి మంచి పేరు తీసుకువచ్చారని, దీన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు బసారత్ ఖాన్, వెంకన్న, లక్ష్మీనారాయణ, దుర్గగౌడ్, తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మారుమూల గ్రామాల ప్రజల ఇబ్బందులు



ఆసిఫాబాద్‌లో చలి మంట కాగుతున్న ప్రజలు

ఆసిఫాబాద్/సిర్పూర్(యు)/మంచిర్యాల/దండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చలి తీవ్రత పెరిగింది. పొద్దంతా వణికి స్తోంది. నాలుగు రోజులుగా మళ్లీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదివారం తిర్యాణి మండలంలో 6.7 డిగ్రీల అత్య ల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అలాగే సిర్పూరు (యు)లో 6.9 డిగ్రీలు, కెరమెరిలో 7.5 డిగ్రీలు, కాగజ్‌నగర్ జంబుగలో 8.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోద య్యాయి.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్ పూర్‌లో ఆదివారం 10.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. జిల్లాలోని దండేపల్లి మం డలం వెల్గనూరులో 10.6 డిగ్రీలు, హాజీపూర్ మండలంలో 10.6 డిగ్రీలు, లక్షెట్టిపేట మం డలం శాంతాపూర్‌లో 10.7 డిగ్రీలు, కన్నెపల్లి మండలంలో 10.8 డిగ్రీలు, దండేపల్లి మండలం లింగాపూర్‌లో 10.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- ఆరోగ్యంపై ప్రభావం..

చలి తీవ్రత నేపథ్యంలో ఆర్యోగంపై జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తు న్నారు. కొవిడ్ కొత్త వేరియేంట్ కేసులు కూడా మొదలైన నేపథ్యంలో అప్రమత్తత తప్పనిసరని హెచ్చరిస్తున్నారు. మాస్కులుధరించాలని సూచిస్తున్నారు. అస్తమా, ఇతర శ్వాసకోస సంబంధమైన ఇబ్బందులు ఉన్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి త్రీవత దృష్ట్యా దీర్ఘకాలిక వ్యాదులతో బాధపడుతున్నావారు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె జబ్బులు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్నవారు వాకింగ్ చేయవద్దని సూచిస్తున్నారు. చలిలో ఎక్కువగా తిరగడంతో రక్తనాళాలు సంకోచించి గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయని, బీపీ, షుగర్ ఉన్నవారు కూడా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. చర్మ సమస్యలకు సంబంధించి జాగ్రత్తలు పాటించి మాయిశ్చరైజర్‌లు ఉపయోగించాలని సూచించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి



సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు అందరు అంకిత భావంతో పని చేయాలని, ఉత్పత్తి ఉత్పాదకతలో ముందుకు సాగాలని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. ఆదివారం మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మందమర్రి జీఎం దేవేందర్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అంతే కాకుండా రక్షణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యం ఉద్యోగులు విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలన్నారు. గతంలో పోలిస్తే సింగరేణిలో భూగర్భ, ఉపరితల గనుల్లో రక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాలను అరికడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో రక్షణ సూత్రాలను పాటించాలని ఆయన కోరారు. రక్షణ వారోత్సవాల సందర్భంగా పకడ్బందీ రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సింగరేణితో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు పకడ్బందీగా ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. సింగరేణిలో 11 ఏరియాలో వేలాదిగా మొక్కలు నాటామని తెలిపారు. సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు నీరు పోశారు.

ఉత్పత్తి లక్ష్య సాధనలో శ్రీరాంపూర్ ఓసీపీ కీలక పాత్ర

శ్రీరాంపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించడంలో శ్రీరాంపూర్ ఓసీపీ కీలక పాత్ర పోషిస్తోందని సీఎండీ ఎన్. బలరాం అన్నారు. ఆదివారం ఆయన ఓసీపీని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఓసీపీ 32 లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాల్సి ఉందన్నారు. ఓబీ నుంచి 3.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణాధికారి శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో పాల్గొనాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల సమస్యల సాధనతో పాటు పలు ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్‌లు తెలిపారు. స్థానికంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యల హక్కుల సాధనకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని అన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

పెన్షన్ చెల్లించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో దశాబ్దాల పాటు సంస్థ అభివృద్ధి కోసం పని చేసి స్వచ్ఛంద విరమణతో పాటు మెడికల్ ఇన్వాలిడ్ ద్వారా అన్‌ఫిట్ అయిన వారికి 11వ వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్, ఎరియర్స్ చెల్లించేలా చూడాలని ఆదివారం సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, వడ్లకొండ వీరయ్య మాట్లాడుతూ తాము ఉద్యోగ విరమణ పొంది సంవత్సరాలు గడుస్తున్నా ఏరియర్స్ అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. విరమణ తర్వాత సంస్థకు తాము చేసిన సేవలను మర్చిపోతున్నారని వాపోయారు. తమకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

అందుబాటులో ఓటరు జాబితా

వాంకిడి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితా తయారు చేసింది. వార్డుల వారీగా ఓటర్ల వివరాలతో సిద్ధం చేసింది. గత అక్టోబరులో ముసాయిదా విడుదల కాగా అభ్యతరాల స్వీకరణ తర్వాత తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. కాగా సాధారణ పౌరులు సైతం ఓటరు జాబితాను చూసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందుకోసం సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా టీఎస్ఈసీ. గౌట్, ఇన్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఫైనల్ రోల్స్ జీపీ అనే మరో ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు ఎంచుకోవాలి. గ్రామానికి సంబంధించిన ఓటర్ల వివరాలు వార్డుల వారీగా కనిపిస్తాయి. ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, మహిళలు, పురుషుల సంఖ్య కనిపిస్తుంది. పక్కనే తెలుగు, ఆంగ్ల భాషలో జాబితా పూర్తి వివరాలతో కనపిస్తుంది.

జంగుబాయి ఉత్సవ కమిటీ

కెరమెరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసిల ఆరాధ్యదైవం జంగుబాయి ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కోట పరందోలిలోని జంగుబాయి క్షేత్రంలో ఆదివాసి సంఘాల నాయకులు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా శ్యాంరావు, గౌరవ అధ్యక్షుడిగా బాజీరావు, ప్రచార కార్యదర్శిగా బాపురావు, సభ్యులుగా నగేష్, జాకు, మల్కు, మోతిరాం, మాణిక్‌రావు, జంగు, చందు, రామరావు తదితరులను ఎన్నుకున్నారు.

నేడు 'ప్రజావాణి' రద్దు

ఆసిఫాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పరీక్షల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదివాంం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు గ్రూపు-2 పరీక్షల విధులలో ఉన్నందున ఎవరు అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రజలు గమనించి దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయానికి రావొద్దని సూచించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రెబ్బెన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గోలేటి టౌన్ ఐఎంఐ ఇండియా మిషన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు జననం, ఇతరాత్ర అంశాలపై నాటిక ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో పాస్టర్ రవీందర్, సంఘ పెద్దలు రాజలింగు ప్రభాకర్, లింగయ్య దేవదాస్, జనార్దన్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

అమ్మవారికి పూజలు

రెబ్బెన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరనగర్‌లోని కనకదుర్గా దేవి మహంకాలి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి దేవర వినోద్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

సీఎస్పీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కస్టమర్ సర్వీస్ పాయింట్(సీఎస్పీ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కాగజ్‌నగర్ మార్కెట్‌లో ఆదివారం సీఎస్పీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ సీఎస్పీ కేంద్రాలతో డబ్బుల లావాదేవీలు త్వరితగతిన పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



20న వెల్‌బేబీ షో

శ్రీరాంపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన నస్పూర్ డిస్పెన్సరీలో వెల్ బేబీ షో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. బేబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్-1, 2, ప్రిన్సెస్-1, 2 కేటగిరీలలో బహు మతులు అందజేస్తామని, ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల టీకాల పట్టిక, ఆధార్‌కార్డులతో పాటు ఆ రోజు ఉదయం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

జీఎం కార్యాలయం ఉద్యోగులకు క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులు, అధికారుల కుటుంబ సభ్యులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, వాలీబాల్, బాల్ ఇన్ బాస్కెట్, బాంబ్ బ్లాస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 23న బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సీనియర్ పీవో పి. కాంతారావు, లా అధికారి ప్రబంధిత, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

18న మహా పుష్పాభిషేకం

నస్పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలోగల గణపతి ఆలయంలో ఈ నెల 18 బుధవారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. 21 రకాలు 1008 కిలోల పుష్పలతో మహా పుష్పాభిషేకం నిర్వహిస్తామన్నారు. అభిషేకం అనంతరం ఉత్సవ విగ్రహాల ఉరేగింపు, పల్లకి సేవా, మంగళ హారతి, తీర్థ గోష్ఠి, స్వామి వారి దివ్య దర్శనం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించాలని వారు కోరారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



దత్తత్రేయ స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న పురుషోత్తమచార్యులు

దండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని గూడెం దత్తసాయి ఆలయంలో ఆదివారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు చక్రవర్తుల పురుషోత్తమ చార్యుల ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, మహా గణపతి పూజ, దత్తాత్రేయ స్వామికి 108 కలశాలతో పూజలు చేశారు. భక్తులు దత్తాత్రేయుడు, సాయిబాబాను దర్శించుకున్నారు. సాయినాథ్ పల్లకి సేవ నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

కత్తెరసాలలో బోనాలు

చెన్నూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తెరసాల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం బోనాలు పోసి, పట్నాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. కొంతమంది భక్తులు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

నియామకం

జన్నారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మగ్గిడి ప్రణవ్‌ను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు నియామక పత్రాన్ని అందజేశారు. మగ్గిడి ప్రణవ్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణకు పాటు పడుతున్నానని, జిల్లా అధ్యక్షుడి బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ మాస్టారు..



అవయవాల గూర్చి వివరిస్తున్న శ్రీనివాస్



అవయవాలు ముద్రించిన టీషర్టులు ధరించిన పిల్లలు

- అవయవాలు ముద్రించిన టీషర్ట్స్‌తో బోధన
- స్కూల్ యునిఫాంలోనే విధులకు హాజరవుతున్న టీచర్
- విద్యార్థులకు విలువలు నేర్పేందుకు ప్రత్యేక కృషి
- సమాజ సేవలోనూ మన్ననలు అందుకుంటున్న భీమ్‌పుత్ర శ్రీనివాస్

నెన్నెల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్ గ్రామానికి చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు జలంపల్లి భీమ్‌పుత్ర శ్రీనివాస్ వినూత్న బోధనతో పిల్లలను ఆకట్టుకుంటున్నారు. ఏపాఠశాలకు వెళ్లినా అక్కడి విద్యార్థులతో మమేకమవుతూ పిల్లలు మెచ్చే టీచర్‌గా పేరు తెచ్చుకుంటున్నారు. మూస పద్ధతిలో కాకుండా పిల్లలకు గుర్తుండేలా తనదైన శైలిలో బోధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. మరోవైపు సమాజ సేవలో ముందుంటున్నారు. కరోనా సమయంలో చేసిన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు దక్కాయి. సోపతి వెల్ఫేర్ సొసైటీ, కొవిడ్ వాలంటీర్స్, భీమ్‌పుత్ర ఫౌండేషన్ పేరిట ఇప్పటికీ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు, పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు సోషల్ మీడియా వేదికగా నిధులు సేకరించి అందజేస్తున్నారు.

● పిల్లల మదిలో చెరగని ముద్ర

నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ బీఎస్సీ బీఈడీ చదివి సైన్స్ పాఠాలు బోధిస్తున్నాడు. నిత్య విద్యార్థిలా సైకాలజీ, తెలుగు, సోషియాలజీలలో పీజీ పట్టాలు పొందారు. టీచర్‌గా కన్నెపల్లి మండలం బొగుడగూడంలో మొదటి పోస్టింగ్ పొంది మూడేళ్లు సేవలందించారు. గొల్లగూడెంలో నాలుగేళ్లు, నెన్నెల మండలం నార్వాయిపేట ప్రాథమిక పాఠశాలలో 14 సంవత్సరాలు పని చేశారు. ఇటీవలె మందమర్రి ఫిల్టర్ బెడ్ పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఆయన అక్కడ కూడా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. విద్యార్థుల్లో కలిసిపోయేందుకు రోజు యూనిఫాం ధరించి స్కూలుకు వస్తారు. వారితోపాటే ఆటలాడుతూ, కలిసి భోజనం చేస్తూ ఉపాధ్యాయుడిలా కాకుండా ఓ స్నేహితుడిలా మెదులుతున్నారు. విద్యతో పాటు విద్యార్థులకు విలువలు నేర్పిస్తున్నారు.

● బోధనలో ప్రత్యేకం...

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించడం శ్రీనివాస్ ప్రత్యేకత. శరీరంలోని అంతర్గత అవయవాల బొమ్మలు ముద్రించిన టీ షర్టులు ధరించి బోధించే విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. వివిధ అవయవాలకు చెందిన 8రకాల టీషర్టులు, మెదడుబొమ్మ ముద్రించిన టోపీ విద్యార్థులకు ధరింపజేసి బోధిస్తున్నారు. ఏ అవయవం ఎలా పని చేస్తుందో దృశ్య రూపకంగా వివరిస్తున్నారు. ఈ విధానంలో బోధించిన వీడియోను విద్యా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపించారు. ఇన్నోవేటివ్ టీచింగ్ విభాగంలో రాష్ట్రంనుంచి 5 వీడియోలను ఎంపిక చేయగా అందులో శ్రీనివాస్ వీడియో ఒకటి. బొమ్మలతో బోధిస్తే సులభంగా అర్థం కావడంతో పాటు విద్యార్థులకు ఎప్పటికీ గుర్తుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ లీడర్‌షిప్ అకాడమి న్యూఢిల్లీ వారు ముద్రించిన రైస్అండ్‌షైన్ ఇన్‌సైట్స్ ఆఫ్ న్యూ ఏజ్ స్కూల్ లీడర్స్ అనే పుస్తకంలో శ్రీనివాస్ బోధన విధానం, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషి ముద్రించారు. అస్సాంలోని గౌహతిలో నిర్వహించిన ఆన్‌లైన్ వెబినార్‌లో శ్రీనివాస్ పాల్గొని పుస్తకంలోని అంశాలను వివరించారు.

● సామాజిక సేవలో...

కరోనా కాలంలో కోవిడ్ వాలంటీర్స్ పేరిట టీమ్ ఏర్పాటు చేసి బాధితులకు, వలస కూలీలకు మందులు, వస్తువులు అందజేశారు. అనారోగ్య బాధితులకు వైద్యం కోసం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి నిధులు సేకరించి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఆడపిల్లల వివాహాలకు సహకరిస్తూ సేవా నిరతి చాటుకుంటున్నారు. వివాహాల్లో ఖర్చులు తగ్గించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. ఇటీవల నార్వాపేటలో అడంబరాలు లేకుండా కేవలం రూ.5 వేలతో పెళ్లి జరిపించారు. వర్షాలకు ఇళ్లు కూలి నిరాశ్రయులైన మైలారం గ్రామానికి చెందిన లింగంపల్లి పోచయ్య-లస్మక్క అనే వృద్ధులకు నిధులు సేకరించి లక్ష రూపాయలతో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. సామాజిక బాధ్యతగా పదోతరగతి మిత్రులతో కలిసి సోపతి వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి తలసేమియా, సికిల్‌సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్ స్వయంగా ఇప్పటికి 35 సార్లు రక్తదానం చేశారు. అవయవదానంపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. తన మరణానంతరం శరీరాన్ని, అవయవాలను ఓ స్వచ్ఛంద సంస్థకు దానం చేస్తూ అంగీకర పత్రాన్ని అందజేశారు.

● రైతు కష్టం తెలిసేలా...

రైతు కష్టం తెలిసేలా పిల్లలను పంట పొలాలకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. దుక్కి దున్ని విత్తనాలు చల్లడం నుంచి కోతలు కోసి ధాన్యాన్ని ఇంటికి చేర్చే వరకు రైతులు చేసే పనులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. పిల్లలతో సాగు పనులు చేయిస్తున్నారు. దీంతో అన్నదాత విలువ విద్యార్థులకు తెలుస్తుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు రైతులపై గౌరవం పెంపొందుతుందని చెప్పారు. రైతులు కష్టపడి పండించిన భోజనాన్ని వృథా చేయబోమని రోజు భోజనానికి ముందు పిల్లలతో ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

● అవార్డులు.. ప్రముఖుల ప్రశంసలు

లాక్‌డౌన్‌లో శ్రీనివాస్ చేసిన సేవలను గుర్తించిన హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్ చేసి ప్రశంసించారు. వివిధ రంగాల్లో సేవలందించిన 15 రాష్ట్రాలకు చెందిన 50 మంది ప్రముఖుల గూర్చి 'మన హీరోలు' పేరిట ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రచయిత ఆర్‌వీ సుబ్బు పుస్తకం రాశారు. అందులో శ్రీనివాస్ గూర్చి ప్రస్తావించారు. కొవిడ్ సేవలకు గాను విజయవాడకు చెందిన గ్రీష్మఫౌండేషన్ వారు ఉమ్మడి రాష్ట్ర స్థాయి కొవిడ్ వారియర్స్ అవార్డును అందజేశారు. గురుతర బాధ్యతగా సమాజాన్ని సన్మార్గంలో నడిపినందుకు సావిత్రిబాయిపూలే ఆదర్శ దంపతుల జాతీయ ప్రతిభా పురస్కారం 2022లో శ్రీనివాస్‌కు దక్కింది. వర్ధిక ఆర్ట్స్ వారు అంబేద్కర్ ఎక్స్‌పీరియన్స్ అవార్డును అందజేశారు. అభినవసంస్థవారు రాష్ట్రస్థాయి పురస్కారం అందించారు. బోధనలో వినూత్న రీతులు అవలంబిస్తున్నందుకు కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు.



పిల్లలతో కలిసి పొలం పనులు



యునిఫాంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీనివాస్

బేరసారాల బదిలీలు...!

5వ పేజీ తరువాయి..

కుందామని ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది సైతం బదిలీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆశావహుల మధ్య మధ్యవర్తిత్వం జరుపుతూ కమీషన్లను మాట్లాడుకుంటు న్నట్లు ప్రచారం జరుగుతోంది.

మంచిర్యాల, నిర్మల్‌కు డిమాండ్....

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫా బాద్ జిల్లాలకే పరస్పర బదిలీల డిమాండ్ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లాకు స్పౌజ్, మెడికల్, పరస్పర బదిలీలకు సుమారు 150మందికిపైగా ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోనున్నట్లు సమాచారం. నిర్మల్‌జిల్లాకు కూడా పెద్దసంఖ్యలోనే దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆయా జిల్లాల్లో ఉన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో ఆశావ హులు, వారి వివరాలను పోస్టు చేస్తున్నారు. వారు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లాలో, అందుకు అనుగుణంగా ఉన్న వారి వివరాలను తెలుసుంటూ వారికి నేరుగా ఫోన్లు చేస్తున్నారు. మరికొందరైతే తాము ఏ జిల్లాలకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకే నేరుగా ఫోన్ చేసి లేదా కలిసి మాట్లాడుకోవాలని వాట్సాప్ గ్రూపుల్లోనే పోస్టులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్నవారి ఆసక్తి....

పరస్పర బదిలీలకు ముఖ్యంగా ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరో యేడాది, రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందనున్న కొందరు ఉపాధ్యాయులు ఫోన్లు చేస్తూ ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. స్పౌజ్, మెడికల్ కేటగిరీల్లో తగినన్నీ పోస్టులు లేకపోవడంతో పరస్పర బదిలీలకే ఉపాధ్యాయులు ఎక్కువగా ఆసక్తి చూపుతు న్నట్లు సమాచారం. రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్నందున ఆసిఫాబాద్ లాంటి జిల్లాకు వెళ్లేందుకు కూడా సిద్ధపడు తున్నట్లు సమాచారం. రిటైర్‌మెంట్ దశలో మంచిర్యాల లాంటి ప్రాంతాన్ని వదిలితే పెద్ద మొత్తంలో గిట్టుబాటయ్యే అవకాశాలు ఉండటంతో ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

గూడెం ఆలయంలో భక్తుల రద్దీ



సత్యదేవుడిని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సెలవు దినం కావడంతో సత్యదేవుడి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలను ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఆదివారం సంఘం 38వ ద్వైవార్షిక మహాసభలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యాలయాలకు సొంత భవనాలు లేక పోస్టల్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, మధుసూదన్, జయరాజు, ప్రకాష్, రాజేశం, రాందాస్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజల అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో రాష్ట్రం ప్రగతితోపాటు ప్రజా సంక్షేమంలో ముందుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్‌లు తెలిపారు. ఆదివారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పాటుపడుతున్నారన్నారు. గత పాలనలో నిరుద్యోగులు పెరిగిపోగా తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల విమర్శలను తాము పట్టించుకోవడం లేదన్నారు. ప్రచార ఆర్బాటాలకు పోకుండా పనులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తున్నారని, మందమర్రి, క్యాతన్‌పల్లిలో వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాయకులు అబ్దుల్ అజీజ్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు రజిని, సత్యపాల్ పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న గాండ్ల తెలికుల సభ్యులు

మంచిర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత గాండ్ల తెలికుల సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు గాండ్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగం చంద్రమౌళి, కోశాధికారి గుండ్ల సదానందం, ఉపాధ్యక్షులు ఆమనగంటి సత్యనారాయణ, గుజ్జేటి బుచ్చయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెన్నంపల్లి సతీష్, సాంఘిక కార్యదర్శి నర్సట ఆంజనేయులు, తదితరులు ప్రమాణం చేశారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



మంచిర్యాలలో మండల పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

మంచిర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహా మండల పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నరహరి శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప అభిషేకంతోపాటు పడిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు గ్రామంలో నగర సంకీర్తన చేశారు. మహా పడిపూజలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, సీనియర్ నాయకుడు గోనె శ్యాంసుందర్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్, గురు స్వాములు ఒడ్నాల రవీందర్, ఎర్రం ప్రభాకర్ అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి చెన్నూరు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సాముహిక అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన సంజీవన్ నంబ్రూత్రీ గురు స్వామి ఆధ్వర్యంలో ఉదయం అయ్యప్ప స్వామి ఆలయంలో అభిషేక, గణపతి పూజ, పుష్పార్చన, మంత్ర పూజ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, మహిళల కొలాటాలు, అయ్యప్ప స్వాముల శరణ ఘోషతో పాఠశాల మైదానం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజన, శరణ ఘోషతో పట్టణం మారుమోగింది. అయ్యప్ప పడి పూజ అనంతరం అయ్యప్ప స్వాములు అగ్ని గుండ ప్రవేశం చేశారు. గురు స్వాములు వేదాంతం సురేష్, పద్మనాభ చారి, మోహన్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, శ్రీనివాస్ అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



చెన్నూరు అయ్యప్ప శోభాయాత్రలో మహిళల కోలాటం

సింగరేణికి ఎనర్జియా ఫౌండేషన్ అవార్డు

- దేశంలోనే అత్యుత్తమ కంపెనీగా ఎంపిక
- పర్యావరణ మైనింగ్, సోలార్ పవర్‌పై అభినందన
- 20న విశాఖపట్నంలో అవార్డు ప్రదానం

శ్రీరాంపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : సింగరేణికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. గతంలో పలు విభాగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసపత్రాలు, అభినందనలు అందుకోగా, పర్యావరణ మైనింగ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో చేస్తున్న కృషికి అభినందనగా ఎనర్జియా కంపెనీ సింగరేణిని "ఇండియాస బెస్ట్ అండ్ మోస్ట్ సస్టెయినబుల్ కోల్ మైనింగ్ ఆపరేటర్ విత్ రెన్యూవబుల్ ఎనర్జీ అడాప్షన్" కేటగిరీలో దేశంలోనే అత్యుత్తమ సంస్థగా ఎంపిక చేసింది. ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఆ సంస్థ 17వ అవార్డు ప్రదానోత్సవంలో అందించనున్నట్లు అవార్డు కమిటీ జ్యూరీ కన్వీనర్ ఆర్. త్యాగరాజన్ అయ్యర్ పేర్కొన్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ మైనింగ్ పద్ధతులైన సర్ఫేస్ మైనర్, కంటిన్యూయస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్ అండ్ కన్వేయర్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను బొగ్గు ఉత్పత్తికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే 245 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాల్లో ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. అలాగే ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎస్‌టీపీపీలో ఉత్పత్తి అయ్యే బాటమ్ యాష్, ఫ్లైయాష్‌ను పూర్తిస్థాయిలో పర్యావరణానికి అనుగుణంగా వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆర్టీసీ డిపోలో విద్యుత్ ఆదా

పగలంతా సోలార్ విద్యుత్ ● రాత్రి ఎన్‌పీడీసీఎల్ వాడకం



ఆర్టీసీ డిపో ఆవరణపై ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ స్టోరేజీ సిస్టం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఆర్టీసీ డిపోలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేశారు.

పగలంతా విద్యుత్‌ను ఆదా చేస్తూ ఆర్టీసీ డిపో ఆదర్శంగా నిలుస్తుంది. సోలార్ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కోసం కార్వీ ఎనర్జీ ఏజెన్సీ 30 ఏండ్ల ఒప్పందం కుదు ర్చుకుంది. పగలంతా విద్యుత్ ఆదా చేస్తూ రాత్రి మాత్రమే ఎన్‌పీడీసీఎల్ కరెంటు వాడుతున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

● సోలార్ పవర్ ద్వారా కాలుష్యం నివారణ

సోలార్ విద్యుచ్ఛక్తి ద్వారా విద్యుత్ ఆదా మెరుగైందని ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. విద్యుత్ శాఖకు రూ.10.10 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, కార్వీ సంస్థ మెయిం టెనెన్స్‌కు, మిగితా ఖర్చుల కోసం ఆదాయం ఉపయోగపడుతుందని తెలిపారు. సోలార్ ప్లాంటు ఉత్తర తెలంగాణలో ఎక్కడ లేదని, మంచిర్యాలలో మాత్రమే ఉందని తెలిపారు. దీంతో కాలుష్యం లేకుండా మంచి సందేశాన్ని ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్టీసీ డిపోలో విద్యుత్‌ను ఆదా చేస్తూ ముందుకు వెళ్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు.

● గతంలో కంటే తక్కువ విద్యుత్ బిల్లు

గతంలో రూ.1.70 లక్షల కరెంటు బిల్లు రాగా సోలార్ విద్యుత్ వాడడంతో ప్రస్తుతం నెలకు రూ.70 వేలు బిల్లు వస్తోంది. సోలార్ పవర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సోలార్ విద్యుత్ ద్వారా 15కేవీ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం జరుగుతుంది. డిపో ఆవరణలో కేవలం 5 కేవీ విద్యుత్ వినియోగిస్తూ మిగితా 10 కేవీ విద్యుత్‌ను ఎలక్ట్రిసిటీ శాఖకు సరఫరా చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో ఈ సారి వందశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా విద్యాశాఖ యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఇప్పటికే పదో తరగతికి సంబంధించి పాఠ్యాంశాలు పూర్తి కావస్తున్నందున అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులకు పాఠ్యాంశాల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.



మైనారిటీ గురుకుల పాఠశాల స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

- విద్యార్థులకు పాఠ్యాంశాల వారీగా ప్రత్యేక తరగతులు
- పరీక్షల ఒత్తిడి తట్టుకునేందుకు కౌన్సెలింగ్

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణత పెంపునకు గురుకుల, పాఠశాల్లో ప్రత్యే తరగతులు నిర్వహిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. వేసవి కాలంలో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎలా మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రత్యేకంగా మెళకువలు ఇస్తున్నారు. ముఖ్యంగా ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఇప్పటి నుంచే ఆయా క్రీడల్లోనూ రాణించేవిధంగా శిక్షణనిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధన ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

● జిల్లాలోని పాఠశాలల్లో..

జిల్లాలోని మైనారిటీ, ఎంజేపీ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర హాస్టళతో పాటు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ పాఠ్యాంశం వారీగా విద్యార్థులకు బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. భవిష్యత్తుపై చక్కని అవగాహన ఏర్పరిచి వారిని పరీక్షలకు సిద్ధం చేసే విధంగా కార్యాచరణ రూపొందించారు. అన్ని పాఠ్యాంశాల్లో మెళకువలు నేర్పిస్తు మంచి ఉత్తీర్ణత శాతం సాధించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా దృష్టి సారించేలా ఎప్పటికప్పుడు వారికి సమాచారం అందిస్తున్నారు.

● వెనుకబడిన విద్యార్థులకు..

వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించేందుకు మాథ్స్, సైన్స్, సోషల్ తదితర సబ్జెక్టుల్లో మంచి మార్కులు పొందేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆదేశాలు ఉండడంతో విద్యార్థుల పట్ల మరింత జాగ్రత్తగా ఉంటూ ఉదయం నిద్ర లేవడం నుంచి రాత్రి స్టడీ అవర్స్ వరకు వారిని కనిపెడుతూ బోధన కొనసాగిస్తున్నారు. విద్యార్థుల స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు..

- వాసాల ప్రభాకర్, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్



పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పాఠశాలలు, గురుకులాల నివేదికలు పొందుపరుస్తున్నాం. వార్షిక పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలి. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

నిధుల కోసం నిరీక్షణ

- అసంపూర్తిగా జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు

- వచ్చిన నీరంతా వాగులోకి చేరుతున్నా పట్టింపు కరువు



అసంపూర్తిగా ఉన్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు మంజూరుకు నిరీక్షణ తప్పడం లేదు. గత ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టుపై నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పటికీ ఈ ప్రభుత్వంపై రైతులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. నిధులు విడుదల చేసి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఎంతో యోగ్యంగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు 2005లో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ.125 కోట్లతో 15వేల ఎకరాల ఆయకట్టు సాగులక్ష్యంతో పనులను ప్రారంభించారు. ప్రభుత్వాలు మారడంతో ఈ ప్రాజెక్టు పనులు పురోగతి లేని పరిస్థితి దాపురించింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఈ ప్రాజెక్టుకు నిధులు వస్తాయన్న కొండంత ఆశతో ఎదురు చూసిన రైతన్నలకు నిరాశే మిగిలింది. ఈ ప్రాంత రైతుల ఆశలు ఎండమావిగా మారుతోంది. ఏటా వర్షాధార పంటలపైనే ఆధార పడాల్సి వస్తోంది.

- గ్యామన్ ఇండియా కంపెనీ..

మొదట టెండరు దక్కించుకున్న గ్యామన్ ఇండియా కంపెనీ పనులు చేసింది. నిధుల లేమి, బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో ఐదేళ్లలోనే చేతులెత్తిసింది. రాష్ట్రాలు విడి పోవడంతో ఈ ప్రాజెక్టు సమస్యను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి గతంలోనే స్థానిక ఎమ్మెల్యే కోనప్ప తీసుకెళ్లి నిధులు తెప్పించారు. ఈ నిధులతో కొంత పనులు చేశారు. పిల్లర్ల స్థాయి నుంచి గేట్ల వరకు పనులు కొనసాగాయి. ప్రస్తుతం రూ.130 కోట్ల నిధులు విడుదలు చేస్తే కాల్వలు నిర్మాణం, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ నిధుల కోసం ఇరిగేషన్ అధికారులు లెక్కలు తీసి ఉన్నతాధికారులకు పంపించినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఏటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ కూడా వరద నిల్వ చేయని పరిస్థితి నెలకొంది. వచ్చిన వర్షం నీరు వచ్చినట్టే వాగులోకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న 53 మంది రైతుల భూముల నష్ట పరిహారం రూ.కోట్ల నిధులు అందించాల్సి ఉంది. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు నివేదికలు కూడా సమర్పించారు. ఈ నిధులు విడుదల చేస్తే త్వరితగతిన పనులు పూర్తి చేసే అవకాశం ఉందని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టును పూర్తి చేయాలి..



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై చిన్న చూపు చూడకుండా నిధులు విడుదల చేయాలి. అలాగే పరిహారం విషయంలో కూడా వెంటనే తగిన చర్యలు చేపట్టాలి. చాలా కష్టంగా ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 15వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.

- గుళ్లపల్లి ఆనంద్, టీడీపీపార్లమెంటు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ప్రమాదకరంగా వంతెన అప్రోచ్ రోడ్డు

- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు



దెబ్బతిన్న వంతెన అప్రోచ్ రోడ్డు

వాంకిడి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని పాటగుడ వాగు వంతెన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో వరదకు వంతెన అప్రోచ్ రోడ్డు వరదకోతకు గురికావడంతో వంతెన సమీపంలో రోడ్డు కంకర తేలి రోడ్డుకు ఇరు పక్కన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వెల్గి, లక్ష్మీపూర్, పాటగుడ, ఖెడెగాం తదితర గిరిజన గ్రామాల ప్రజలు ప్రతి రోజు వివిద పనులకోసం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన సమీపంలో ఇటీవల వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో పలువురు గాయాలపాలయ్యారు. రాత్రి సమయంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు వంతెన సమీపంలో ఏర్పడిన గుంతలు కనిపించక పోతుండడంతో అదుపుతప్పి పడిపోయి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కలెక్టరేట్ ఎదుట గత ఆరు రోజులుగా చేస్తున్న నిరసన దీక్షను ఆదివారం హరీష్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఏడాది గడిచిన నెరవేర్చలేదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోవడం అన్యాయమన్నారు. చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు నగేష్, గేడేకర్ సంతోష్, అరుణ, అనూప్, ప్రశాంత్, పవన్, సందీప్, సత్యనారయణ, రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపు దిశగా ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా ముందుకు సాగాలన్నారు.అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పోచమ్మ విగ్రహం ప్రతిష్ఠ

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం పాతసార్సాల గ్రామంలో ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు ప్రశాంతం



ఆసిఫాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కాగజ్‌నగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం మొదటి రోజు గ్రూపు-2 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 4,393 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. కాగా ఉదయం జరిగిన మొదటి పేపరుకు 2455 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో పేపరుకు 4,393 మంది అభ్యర్థులకు గాను 2,440 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. దీంతో రెండు పేపర్లకు మొత్తం 55.71 హాజరు శాతం నమోదైంది. పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలు తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. గ్రూపు-2 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్‌ను పరీక్ష కేంద్రాల వద్ద అమలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకొని క్షుణ్ణంగా తనికీ చేసి పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాలకు అలస్యంగా వచ్చిన వారిని అదికారులు పరీక్షలకు అనుమతించలేదు. ఆసిఫాబాద్ పట్టణంలో ముగ్గురు అభ్యర్థులు, కాగజ్‌నగర్ పట్టణంలో 10 మంది అభ్యర్థులు అలస్యంగా రావడంతో అదికారలు వీరిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. కాగజ్‌నగర్‌కు చెందిన రెండు చేతులు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా పరీక్ష రాశారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమదేవి, పరీక్షల రీజినల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనరసింహం, డీఎస్పీలు కరుణాకర్, రామనుజం ఉన్నారు. కాగజ్‌నగర్‌లో సీఐ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఉచితంగా ఆటో సౌకర్యం కల్పించారు. బస్టాండు వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. బస్టాండు వద్ద దిగిన అభ్యర్థులను నేరుగా ఆటోల ద్వారా పరీక్ష కేంద్రాలకు తరలించారు. సీఐ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు డీకొండ రమేష్, మహేందర్, సందీప్, నరేష్, రాజు తదితరులు బందోబస్తు నిర్వహించారు.



ఆసిఫాబాద్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



కాగజ్‌నగర్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగుడు (చేతులు లేని) జాకీర్ పాషా

ముగిసిన దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సిర్పూరు(టి), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి) మండల కేంద్రంలోని సాయి దేవాలయంలో గత 9 రోజుల నుంచి ప్రారంభమైన సాయి దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయ నిర్వహకులు సాయి విగ్రహం, దత్తపాదుకలతో ఊరేగింపు తీశారు. ఈ ఊరేగింపు ఆలయం నుంచి డౌనల్, గోవింద్ పూర్, బెస్తవాడ, పేట్ మహిళ తదితర వీధుల గుండా సాగింది. ఈ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఊరేగింపులో సిర్పూరు(టి), కౌటాల, చింతలమానేపల్లి, వీర్ధంది, మహారాష్ట్ర లోని దాబా, సాక్మూర్, సోనాపూర్, హుడ్కిలి, మాకోడి, జక్కాపూర్ తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. సోమవారం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వహకులు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

సిర్పూరు(టి): మండల కేంద్రంలోని కమలాకర్ ఇంటిలో ఏర్పాటు చేసిన దత్త నవరాత్రి ఉత్సవాలను ఆదివారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమలాకర్ కుటుంబ సభ్యులు ఏటా దత్త నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా కమలాకర్ కుటుంబీకులు దత్త నవరాత్రి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ో బీజేపీ నాయకులు ఎల్మలే శంకర్, నీరెటి సత్యనారాయణ, నానయ్య, సాయి, దుర్గం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



ఈసుగాంలో బోనాలు సిద్ధం చేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం మల్లన్న బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయమే మల్లన్న ఆలయానికి చేరుకొని పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు శివాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కాగజ్‌నగర్ మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు రావటంతో ఆలయ ప్రాంగణమంతా అంతా కిక్కిరిసి పోయింది. భక్తుల రద్దీతో ఆలయ కమిటీ సభ్యులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టైగర్ కారిడార్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కారిడార్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల అటవీశాఖ పీసీసీఎఫ్ సందర్శించడం జరిగిందని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలలో టైగర్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని చెప్పాడం అన్యాయమన్నారు. ప్రజలను ప్రజాప్రతినిదులను సంప్రదించకుండా ప్రతిపాదనలు చేసి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తే ప్రతిఘటిస్తామన్నారు. తగు ప్రణాళికలు లేకుండా ఊర్లను తరలిస్తామని అటవీశాఖ అదికారులు చెబుతున్నారని ఈ విదనాన్ని బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, అరిగెల మల్లికార్జున్ యాదవ్, కొట్నాక విజయ్‌కుమార్, కొంగ సత్యనారాయణ, సతీష్, అరుణ్ లోయ, కృష్ణకుమారి, శ్రీదేవి, సొల్లు లక్ష్మి, విశాల్, జయరాజ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పులుల సంరక్షణ పేరుతో కుట్ర



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్

కాగజ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణ పేరుతో రైతులను నిర్వాసితులుగా మార్చే కుట్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం కోసం పలు రకాల పేర్లు చెప్పి అటవీ భూములను స్వాధీనం చేసుకోవడానికి కుట్ర పన్నుతున్నదని చెప్పారు. ఆదివాసీలను, ఇతర రైతులను నిర్వాసితులను చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నట్టు ఆరోపించారు. ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద పులులు సంచరిస్తున్నాయని, కాగజ్‌నగర్ టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న పేరుతో ఫారెస్టు సీసీఎఫ్ జిల్లాలో పర్యటించి కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినటు తెపారు. దీని ద్వారా చాలా గ్రామాలు ఖాళీ చేయించి భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం కోసమే ఈ కుట్ర పన్నుతున్నట్టు వివరించారు. పులుల కారిడార్‌ను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన్న రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.